సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



ఫైనాన్షియర్ దారుణ హత్య

ప్రొద్దుటూరుకు చెందిన ఫైనాన్షియర్ వేణు గోపాల్ రెడ్డి దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు హతమార్చి చాపాడు సమీపంలోని కుందూ నదిలో పడేశారు. -IIలో



అక్రమంగా కలప తరలింపు

అక్రమంగా కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని అటవీ అధికారులు జరిమానా విధించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి అటవీ కార్యాలయానికి తరలించారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.260	రూ.330
రెండోరకం	రూ.180	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 141 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 22వ తేదిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒకక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

24న ధ్వజస్తంభానికి సంప్రోక్షణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి దేవాలయంలో 24న ధ్వజస్తంభానికి సంప్రోక్షణ నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి తెలిపారు. ఆదివారం ఆమె ఇక్కడ మాట్లాడుతూ..ధ్వజస్తంభం పునరుద్ధరణలో భాగంగా కొన్ని రోజుల కిందట బాలాలయం ఏర్పాటు చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో ధ్వజస్తంభం పునరుద్ధరణ పనులు పూర్తి కావడంతో మంగళవారం సంప్రోక్షణకు అంకురార్పణ చేసి, బుధవారం బాలాలయంలో ఉంచిన కలిశంలోని ప్రాణ ప్రతిష్టను ధ్వజస్తంభంలోకి సంప్రోక్షణ ద్వారా పంపనున్నట్లు చెప్పారు.

గంగమ్మా..కాపాడమ్మా



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ ఆలయంతోపాటు మద్దిరేవుల గ్రామం, వంకగడ్డ రాచపల్లి సమీపంలో వెలసిన శ్రీ మారెమ్మ ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తల్లీ ..కాపాడమ్మా అంటూ అమ్మవార్లను వేడుకున్నారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

జాతీయ స్థాయిలో మిట్స్ ఎన్‌సీసీ క్యాడెట్‌కు పతకం



నాగేంద్ర వర్మను అభినందిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్ సింగ్ తదితరులు

కురబలకోట: మదనపల్లె సమీపంలో అంగళ్లలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ ఎన్‌సీసీ సి సర్టిఫికెట్ క్యాడెట్ సి. నాగేంద్ర వర్మ ఆలిండియా థాల్ సైనిక్ క్యాంప్‌లో రజిత పతకం సాధించారు.ఆంధ్ర, తెలంగాణ డైరెక్టరేట్ తరపున న్యూఢిల్లీ డైరెక్టర్ జనరల్ నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ప్రధాన కార్యాలయంలో థాల్ సైనిక్ క్యాంపు నిర్వహించారు. ఇందులో నాగేంద్ర వర్మ ఫైరింగ్ ఈవెంట్‌లో ప్రతిభ కనబరిచినట్లు వీసీ యువరాజ్ తెలిపారు. అంతేగాకుండా నాన్ మెయిన్డ్ టగ్ ఆఫ్ వార్ పోటీలో రజిత పతకం సాధించాడని, లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్ పాల్ సింగ్ ద్వారా ప్రశంసాపత్రం అందుకున్నాడని తెలిపారు. నాగేంద్ర వర్మను చాన్స్‌లర్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి, ప్రో చాన్స్‌లర్ నాదెళ్ల ద్వారకనాథ్ అభినందించారు.

27న కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక



కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయం కబడ్డీ పురుషుల క్రీడా జట్టు ఎంపికలు ఈ నెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు వైవీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఇందులో పాల్గొనదలచిన క్రీడాకారులు వైవీయూ అనుసంధానమైన కాలేజీల్లో అభ్యసించినవారై ఉండాలన్నారు. ఎంపికలకు వచ్చే సమయంలో కాలేజీ ప్రిన్సిపాల్ లేదా ఫిజికల్ డైరెక్టర్‌తో సంతకం చేసినటువంటి ఎలిజిబిలిటి ఫామ్‌ను, కాలేజీ స్టడీ సర్టిఫికెట్‌పై ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించాలన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు జులై 1వ తేదీ 2025 నాటికి 17 ఏళ్లు నిండి ఉండి 25 ఏళ్లలోపు ఉన్న క్రీడాకారులు అర్హులని తెలిపారు. పోటీలకు వచ్చిన క్రీడాకారులు ఉదయం 9 గంటలలోపు తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని తెలిపారు.

నవదుర్గ వైభవం.. శరన్నవరాత్రి శోభితం

పసిడిపురికి ఉత్సవకళ వచ్చింది.. దేవీ నవరాత్రుల వేడుకకు పట్టణం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. విద్యుద్దీపాలంకరణతో గోపురం వెలిగిపోతోంది. రంగురంగుల పందిళ్లతో ఊరంతా మురిసిపోతోంది. వీధి వీధిన అమ్మవారి ప్రతిమలతో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది. అంబరాన్నంటే దసరా సంబరానికి ప్రొద్దుటూరు వేదిక కానుంది. ఇక జిల్లాలోని మిగతా అమ్మవారి ఆలయాల్లోనూ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- కోరిన కోర్కెలు తీర్చే తల్లి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి
- నేటి నుంచి వైభవంగా 136వ దసరా ఉత్సవాలు ప్రారంభం
- పసిడిపురిలో అట్టహాసంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు



వజ్రపుచీరలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



సర్వాంగ సుందరంగా ముస్తాబైన కడప నగరంలోని విజయదుర్గమ్మ ఆలయం



బంగారు చీరలో వాసవీ మాత

ప్రొద్దుటూరు కల్చరల్: దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. దసరా ఉత్సవాల నిర్వహణలో రెండవ మైసూరుగా ఖ్యాతిగాంచిన ప్రొద్దుటూరు పట్టణంలో సోమవారం నుంచి దసరా వేడుకలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఇక్కడ జరిగే వేడుకలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా పట్టణానికి తరలి వస్తారు. పుత్తడిపురంగా పేరొందిన ప్రొద్దుటూరు అంటే తొలుత గుర్తుకు వచ్చేది శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయం. ఈ ఆలయంలో నిర్వహించే దసరా వేడుకలు ప్రఖ్యాతిగాంచాయి. సోమవారం నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు ఆర్యవైశ్య సభ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలోని శ్రీవాసవీ మాత కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతోంది. అమ్మవారిశాలను 1890లో నిర్మించారు. ఈ ఆలయం ఎత్తైన గాలి గోపురం కలిగి, చక్కని శిల్ప కళా నైపుణ్యంతో ఉట్టిపడుతోంది. పట్టణానికి శోభ చేకూర్చే విధంగా ఆలయ గాలి గోపురం నిర్మితమైంది. దసరా ఉత్సవాల్లో విజయదశమినాడు నిర్వహించే శమీదర్శన గ్రామోత్సవం, అర్ధరాత్రి తొట్టి మెరవని అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

రోజూ విశేషంగా అమ్మవారి అలంకారాలు

దసరా ఉత్సవాలు సోమవారం నుంచి అక్టోబర్ 3 వరకు ఘనంగా నిర్వహించేందుకు చురుగ్గా జరుగుతున్నాయి. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవిని ఒక్కోరోజు ఒక్కో రూపంలో అలంకరిస్తారు. సోమవారం సాయంత్రం రాజరాజేశ్వరి దేవి, 23న భవానీదేవి, 24న శారదాదేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న సాయంత్రం శ్రీదేవి వనవిహారిణి, రాత్రి బిల్వవృక్ష వాసిని పార్వతీదేవి, 27న గజలక్ష్మీదేవి, 28న బాలాత్రిపుర సుందరీదేవి, 29న సరస్వతీదేవి, 30న మహిషాసుర మర్దినీ దేవి, అక్టోబర్ 1న గాయత్రీదేవి, 2న విజయలక్ష్మీదేవి అలంకారం శమీదర్శన మహోత్సవం, అర్ధరాత్రి తొట్టి మెరవణి, 3న వాసవీ కన్యకా పరమేశ్వరిదేవిగా భక్తులకు దర్శన మివ్వనున్నారు.



విద్యుత్ దీపాలంకరణలో శివాలయం

ఉత్సవాలు ప్రారంభం ఇలా..

శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం నుంచి 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు సోమవారం ఉదయం 7.20గంటలకు వేదపఠనంతో నవగంగ తీర్థములు శ్రీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయానికి తీసుకెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అమ్మవారిశాల నుంచి మంగళవాయిద్యాలతో బయల్దేరి తెల్లాకుల శివయ్యగారి శ్రీనగరేశ్వరస్వామి ఆలయం నుంచి కన్యకాపరమేశ్వరి దేవి పురాణాన్ని ఆర్యవైశ్యులు తీసుకురావడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

'బంగారు' అమ్మవారు

వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి రోజూ విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు వాసవీ నిత్యహోమాన్ని లోకకల్యాణార్థం పండితులు చేస్తుంటారు. పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారికి ఏ ఆలయంలో లేని విధంగా పుత్తడి ఆభరణములు, పాశాంకుశాలు, వజ్రపు చీరె, కిరీటం, బంగారు చీరె, ముత్యాలచీరెలు ఉన్నాయి. విశేష పర్వదినాల్లో భక్తులకు అమ్మవారు వీటిలో దర్శనమిస్తారు.

సిరిపురికి ఉత్సవ కళ

దేవీశరన్నవ రాత్రుల మహోత్సవాలకు పట్టణంలోని పలు ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. అన్ని ఆలయాల దసరా ఉత్సవ కమిటీ వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని పలు ఆలయాలు టెంపుల్ సెట్టింగ్, కలకత్తా సెట్టింగ్, గుడియాతం వంటి పందిరి సెట్టింగ్‌లతో, రంగురంగుల ఎల్‌ఈడీ లైటింగ్ డెకరేషన్, భారీ విద్యుత్ ఎల్‌ఈడీ ఆర్చీలతో నూతన శోభను చేకూర్చారు. ఆలయాల గోపురాలపై ఎల్‌ఈడీ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి వీధులలో లైటింగ్ డెకరేషన్‌తో అందంగా తీర్చిదిద్దారు. వీధుల్లో రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆకట్టుకునేలా పందిరిని తీర్చిదిద్దుతున్నారు. పట్టణానికి చిహ్నమైన అమ్మవారిశాల గాలిగోపురాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.


అక్రమ ప్రమోషన్లపై ప్రభుత్వానికి నివేదిక



మదనపల్లె: హంద్రీ–నీవా ప్రాజెక్టు రెండోదశ మదనపల్లె సర్కిల్–3 పరిధిలో జరిగిన అక్రమ పదోన్నతుల వ్యవహారం కొలిక్కి వచ్చింది. హంద్రీ–నీవాలో 'అక్రమ ప్రమోషన్' శీర్షికన అగస్టు 7న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై సమగ్ర వివరాలతో నివేదిక పంపాలని ఈఎన్‌సీ నుంచి మెమోలు జారీ అయ్యాయియి. ఈ విషయంలో ఎస్‌ఈ విఠల్‌ప్రసాద్ వివరాలతో నివేదికను పంపడం ఆలస్యంగా తెలిసింది. ఏపీఈఎస్‌ఎస్ నిబంధనల షెడ్యూల్ ప్రకారం టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకానికి అవసరమైన అర్హత కోసం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ నిర్వహించే ట్రేడ్ టెస్ట్ (డ్రాఫ్ట్స్ మ్యాన్) సివిల్ లేదా మెకానికల్ కోర్సులో ఉత్తీర్ణత సాధించాలి. నియామకాలు, బదిలీలు, పదోన్నతులను పరిగణలోకి తీసుకునేటప్పుడు సర్వీసు నియామకాల జీవో, సూచనలను కచ్చితంగా పాటించాలి. అయితే హంద్రీ–నీవా ప్రాజెక్టులో పని చేస్తున్న ఉద్యోగుల విషయంలో పాటించలేదని తేలింది. మదనపల్లె ఎస్‌ఈ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగికి మూడు ప్రమోషన్లను నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని నిర్ధారించారు. ఎస్‌ఈ చిట్టిబాబు టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉద్యోగ నియామకం చేయగా ఎస్‌ఈ పి.కృష్ణ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా, ఎస్‌ఈ బీవీ.సుబ్బారావు అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్‌గా, ఎస్‌ఈ సీఆర్.రాజగోపాల్ టెక్నికల్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి కల్పించారని, ఆ సమయంలో పనిచేసిన డీఎస్‌ఈ, సూపరింటెండెంట్ వివరాలను పేర్కొన్నారు. అలాగే కుప్పం డివిజన్‌లో పని చేస్తున్న బ్లూ ప్రింటర్ ఆపరేటర్లు వై.చెన్నయ్య, కె.అబ్బిరెడ్డెయ్య, కదిరి డివిజన్‌లో పని చేస్తున్న పి.ఖాదర్‌బాషాలకు అర్హతలేకున్నా టెక్నికల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ పదోన్నతులను ఎస్‌ఈ బీవీ.సుబ్బారావు ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ఈ నివేదికపై ప్రభుత్వం తీసుకున్న చర్యల వివరాలు వెలుగులోకి రాలేదు. నివేదికతో ఉద్యోగుల్లో కలవరం నెలకొంది.

నాణ్యత నీళ్లకే ఎరుక

బి.కొత్తకోట వద్ద ఊడిన హంద్రీ–నీవా కాలువ సిమెంట్ లైనింగ్



కాలువ పక్కన పడిన గండి



ఊడిపోయిన కాంక్రీట్ లైనింగ్

మదనపల్లె: హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ (పీబీసీ)కు కాంక్రీట్ లైనింగ్ పిడకలా ఊడిపోవడం పనుల నాణ్యతను ప్రశ్నించేలా చేస్తోంది. బి.కొత్తకోటలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షం నీళ్ల వాగులు, వంకలు, చెరువుల్లోకి ప్రవహించాయి. ఇదే విధంగా బి.కొత్తకోట–బడికాయలపల్లె మార్గం సమీపంలోని పీబీసీ కాలువ 102 కిలోమీటర్ వద్ద కాలువకు వేసిన కాంక్రీట్ లైనింగ్ కూలిపోయింది. లైనింగ్ ఒకరకమైన ఆకారంలో కూలగా అంచున చీలింది. దానివద్ద నీళ్ల కాలువ నుంచి గండిపడి బయటకు వెళ్లాయి. ఇలా ఎందుకు జరిగింది అనేదానిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. లైనింగ్ పనుల్లో నాణ్యత లోపించిందా లేక మరేదైనా జరిగిందా అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. పలుచోట్ల కాలువలో నీటి ప్రవాహం వెళ్తున్న ఎత్తులో కాంక్రీట్ పనులు దెబ్బతిన్నట్టు కనిపిస్తున్నాయి. అయితే నీటి ప్రవాహం తగ్గాక కాని కాంక్రీట్ లైనింగ్ పనులపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. కానీ 102 కిలోమీటర్ వద్ద ఊడిన కాంక్రీటు లైనింగ్ వ్యవహారంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నాణ్యతలేక ఊడిందా లేకపోతే నీటి మళ్లింపు కోసం ఎవరైనా తెగ్గొట్టారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ప్రాజెక్టు ఎస్‌ఈ విఠల్ ప్రసాద్ మాట్లాడుతూ కాంక్రీట్ దెబ్బతిన్న ప్రాంతానికి చెందిన రైతులు లైనింగ్‌ను తెగ్గొట్టడం వల్లే ఊడిపోయిందని,నాణ్యతా లోపం కాదని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఈఈ, డీఈలకు ఆదేశించగా పరిశీలించినట్లు చెప్పారు.

పూలతోట.. నష్టాలబాట

- పూల ధరలు భారీగా పతనం
- ఆందోళనలో అన్నదాతలు
- జిల్లాలో 1048 ఎకరాల్లో పూలసాగు



కొత్తపల్లెలో వర్షాలకుదెబ్బతిన్న బంతిపూల తోటలు

గుర్రంకొండ: పూలతోటలు సాగు చేసిన రైతులకు ప్రస్తుతం కష్టకాలం దాపురించింది. మార్కెట్లో ధరలు పూర్తిగా పడిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఆరుగాలం కష్టపడి చమటోడ్చి పండించిన పూలకు గిట్టుబాటు ధరల్లేక అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ప్రస్తుతం మార్కెట్లో కిలో పూల ధరలు రూ.10కి పడిపోయాయి. రానున్న దసరాపండుగ సమయంలోనైనా ధరలు పుంజుకొంటాయనే ఆశతో రైతులు ఉన్నారు.

1048 ఎకరాల్లో పూల సాగు...

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో1048 ఎకరాల్లో బంతి పూలతోటల సాగు చేపట్టారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో తోటలు అదునుకొచ్చి దిగుబడి ప్రారంభమైంది. ఎకరం పూలతోట సాగు చేయాలంటే రూ.1.50లక్షల నుంచి రూ.1.75 లక్షల వరకు ఖర్చు వస్తుంది. పూలనారు కొనుగోలు నుంచి పొలం దుక్కులు, డ్రిప్ మెటీరియల్, మల్చింగ్‌ఖర్చు, కోతకొచ్చేవరకు రైతులకు ఈ పాటి ఖర్చు వస్తుంది. మార్కెట్లో కనీసం కిలో పూల ధర రూ.30 నుంచి 50లోపు ఉంటే రైతుకు పెట్టుబడి చేతికొస్తుంది.

- పది రోజులుగా మార్కెట్లో పూల ధరలు పతనమయ్యాయి. పదిహేను రోజుల కిందట మార్కెట్లో కిలో రూ. 70 నుంచి రూ.85వరకు ధరలు పలికాయి. తదనంతరం పరిణామాలతో బంతిపూల ధరలు మార్కెట్లో రోజురోజుకు తగ్గిపోయాయి. ప్రస్తుతం కిలో రూ.12 నుంచి రూ.10 వరకు ధరలు పలుకుతుండడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. గతంలోఇదే సీజన్‌లో కిలో రూ. 60 వరకు ధరలు పలికాయి. అదే ఆశతో రెండునెలలుగా పూలతోటల పెంపకం చేపట్టిన రైతులకు నిరాశే మిగిలింది.

వర్షాలకు దెబ్బతిన్నతోటలు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బంతిపూల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో మార్కెట్లో గిట్టుబాటు ధరలు లభించడం లేదని రైతులు వాపోతున్నారు.35 కిలోల పూల బస్తా బెంగళూరుకు తరలించాలంటే రూ. 250 వరకు ఖర్చు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.10 పలుకుతోంది. ఈలెక్కన ఒక బస్తాకు రూ.525 మాత్రమే ఒక్కోసారి గిట్టుబాటు లభిస్తోంది. అంత దూరం మార్కెట్‌కు తీసుకెళ్లినా బస్తాపైనా రూ.275 మాత్రమే రైతుకు గిట్టుబాటు అవుతోంది. దీంతో పూలను మార్కెట్లకు తరలించినా ప్రయోజనం లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో పూల సాగు, ధరల వివరాలు

నియోజకవర్గం	పూలసాగు (ఎకరాల్లో)	3 నెలలుగా ధరలు (కిలోల్లో)
పీలేరు	325	జూన్ 15 రూ. 45
మదనపల్లె	245	జులై 01 రూ.40
తంబళ్లపల్లె	295	జులై 15 రూ. 57
రాయచోటి	55	ఆగస్టు 01 రూ.75
రైల్వేకోడూరు	63	ఆగస్టు 15 రూ.85
రాజంపేట	65	సెప్టెంబర్ 17 రూ.10

దసరా పండగపై ఆశలు

రానున్న దసరా పండుగ పైనే బంతిపూల రైతులు ఆశలు పెట్టుకొన్నారు. ధరలు పతనమవడంతో వ్యాపారులు పూల కొనుగోలుపై పెద్ద ఆసక్తి చూపించడంలేదు.జిల్లాలో సాగు చేసేపూలను మదనపల్లె, కడప, తిరుపతి, బెంగళూరు, చెన్నై లాంటి పట్టణాలకు తరలిస్తుంటారు. ఇటీవల పూల బస్తాలతో బెంగళూరు మార్కెట్‌కు వెళ్లిన రైతులకు కనీసం వ్యాపారులు కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు దసరా పండుసీజన్‌లో గిట్టుబాటుధరలు లభిస్తాయనే ఆశతో ఉన్నారు.

ధరలు పడిపోయాయి



ప్రస్తుతం మార్కెట్లో పూల ధరలు పడిపోయాయి. పదిహేనురోజుల కింద కిలో రూ.65 వరకు ఉండేది. ఇప్పుడు అష్టకష్టాలు పడి మార్కెట్‌కు పూలను తరలించినా అంతంత మాత్రంగానే ఆదాయం వస్తోంది.

– నారాయణ, పూలరైతు,మొరంపల్లె

పెట్టుబడి నష్టపోయాం



రెండు ఎకరాల్లో పూలతోటలు సాగు చేశాను. వర్షాలతో తోటలు దెబ్బతిన్నాయి.ఇప్పటివరకు రూ.3 లక్షలు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం ధరలు పడిపోయాయి. దీంతో పెట్టుబడి నష్టపోయాం.

– సావిత్రమ్మ, పూలరైతు, కొత్తపల్లె

బాబు బినామీల కోసమే ప్రైవేటీకరణ

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష,ప్రజా సంఘాల నేతలు

కడప రూరల్: వైద్య విద్యను పరిరక్షించాల్సిన పాలకులే భక్షకులుగా మారారని నేతలు ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన బినామీల కోసమే వైద్య విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకంటామని నేతలు హెచ్చరించారు. ఆదివారం కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో 'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఎవరి కోసం' అనే అంశంపై మేధావులు, అఖిలపక్ష, ప్రజా సంఘాల నేతల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లి శివరామ్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అందులో భాగంగానే మెడికల్ కాలేజీల ఏర్పాటుకు చర్యలు చేపట్టారని అన్నారు. దీంతో ప్రతిభావంతులైన పేద విద్యార్థులంతా తమ కల నెరవేరబోతోందని సంతోషపడ్డారని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తూ నిర్ణయించడం దారుణమని అన్నారు. బాబు తన బినామీలకోసమే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి ఓజీ సినిమాపై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై లేదన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శివ యాదవ్, న్యాయవాది సంపత్‌కుమార్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వైద్య విద్యతో పాటు, విద్యారంగం మొత్తం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగాలన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు మాట్లాడుతూ ప్రైవేటీకరణ ప్రజా వ్యతిరేక నిర్ణయమని తెలిపారు.

క్లుప్తంగా

ఒంటిమిట్ట రామయ్యకు పూజలు



రామయ్య సన్నిధిలో చందు జనార్దన్

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయం, నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయాల్లో రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్దన్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి వచ్చిన ఆయనకు రెండు చోట్ల ఆలయ మర్యాదలతో స్వాగతం లభించింది. ముందుగా రామయ్య మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సౌమ్య నాథుడి సన్నిధిలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సోమ, రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన నీలగిరి చెట్టు



రోడ్డుపై కూలిన నీలగిరి చెట్టు

మదనపల్లె రూరల్ : మండలంలోని సీటీఎం సమీపాన కంకరమిషన్ వద్ద ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా నీలగిరి చెట్టు కూలింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూమి బాగా తడిచి ఉండడంతో బలంగా వీస్తున్న ఈదురు గాలులకు చెట్టు నేలకొరిగింది. సమయానికి రోడ్డుపై వాహన, జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు విషయాన్ని పంచాయతీ అధికారులకు తెలుపడంతో వారు ఘటనాస్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో చెట్టును తొలగించారు.

తెలుగు తమ్ముళ్లపై కేసులు నమోదు..

రాయచోటి : ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న తెలుగు తమ్ముళ్లపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదయ్యాయి. శనివారం సాయంత్రం పట్టణంలోని మదనపల్లె మార్గంలో టీడీపీకి చెందిన రెండు వర్గాలు ఒకరిపై మరో దాడులు చేసుకునే విషయం తెలిసిందే. ఈ సంఘటనలో తెలుగు యువత అధ్యక్షుడు జాబీర్, మరో తెలుగు మైనార్టీ నాయకుడు సయ్యద్‌లకు రక్త గాయాలయ్యాయి. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లీ సీరియస్ కావడంతో రాయచోటి అర్బన్ పోలీసులు ఇరువురిపై ఆదివారం కేసులు నమోదు చేశారు.

అక్రమంగా కలప తరలింపు



సీజ్ చేసిన ట్రాక్టర్

మదనపల్లె రూరల్ : అక్రమంగా కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని అటవీ అధికారులు జరిమానా విధించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న చెట్లు కొందరు తొలగించి ముక్కలుగా చేసి ట్రాక్టర్‌లో తరలించేందుకు ప్రయత్నించారు. ఇన్‌చార్జ్ డీఆర్వో శివకుమార్ జిల్లా ఆస్పత్రికి చేరుకుని, అనుమతులు లేకుండా కలప తరలిస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి శంకర్‌రెడ్డిని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే అనుమతితో తరలిస్తున్నామని, కావాలంటే ఫోన్ చేయిస్తానని చెప్పాడు. దీంతో అటవీ అధికారులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫోన్ చేశారు. ఆయన స్పందిస్తూ తాను ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి అటవీ కార్యాలయానికి తరలించారు. ఎఫ్ఆర్వో జయప్రసాదరావు విచారించి రూ.8,500 జరిమానా విధించారు.

ఫైనాన్షియర్ దారుణ హత్య

- ఇంటి పక్కనే హతమార్చి కుందూ నదిలో పడేసిన దుండగులు
- రెండు రోజులు గాలించి మృత దేహాన్ని గుర్తించిన పోలీసులు



వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : అవసరానికి అప్పులివ్వడమే ఆయన చేసిన నేరమా. తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించమని అడిగిన పాపానికి రుణదాతనే దుండగులు హతమార్చారు. ప్రొద్దుటూరుకు చెందిన ఫైనాన్షియర్ కొండా వేణుగోపాల్ రెడ్డి (54) శనివారం దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు దారుణంగా హతమార్చి చాపాడు సమీపంలోని కుందూ నదిలో పడేశారు. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. కుటుంబ సభ్యులు ఊహించినట్టే ప్రముఖ వడ్డీ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి బాకీదారుల చేతిలోనే హత్యకు గురయ్యాడు. పోరుమామిళ్ల మండలం రెడ్డికోట గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి కొన్నేళ్ల క్రితం ప్రొద్దుటూరుకు వచ్చి స్థిరపడ్డారు. కొన్నేళ్ల వరకూ వైఎంఆర్ కాలనీలో నివాసం ఉండే వారు. జమ్మలమడుగు రోడ్డులోని మున్సిపల్ ప్లాట్‌లలో విశాలమైన భవంతి నిర్మించుకొని నాలుగేళ్లుగా అక్కడే ఉంటున్నారు. వేణుగోపాల్‌రెడ్డికి భార్య ప్రమీలాదేవి, కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కుమార్తె స్వప్న ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఎంఎస్ చేస్తున్నాడు. కుమార్తె బీటెక్ పూర్తి చేసి ఇంట్లో ఉంటోంది. వేణుగోపాల్‌రెడ్డి తెలిసిన వారికి వడ్డీకి డబ్బులు ఇస్తూ గడువు ముగిసిన తర్వాత తిరిగి తీసుకునేవాడు. ఇలా పట్టణంలో పెద్ద మొత్తంలో అప్పులిచ్చినట్లు తెలుస్తోంది.



కుందు నది వద్ద ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అరుణ్‌రెడ్డి

ఇంటి సమీపంలోనే కాపు కాచి..

వేణుగోపాల్‌రెడ్డి ఇల్లు జమ్మలమడుగు రోడ్డు పక్కన బొల్లవరం ప్లాట్‌లో ఉంది. ప్రధాన రహదారికి అతి సమీపంలో ఆయన ఇల్లుంది. శుక్రవారం సాయంత్రం 6.30 సమయంలో ఇంటి నుంచి స్కూటీలో అతను బయటికి వెళ్లాడు. రోజూ రాత్రి 8–15, 8–30 గంటల్లోగా ఇంటికి వచ్చేవాడు. అయితే శుక్రవారం రాత్రి 8.50 దాటినా వేణుగోపాల్‌రెడ్డి ఇంటికి రాకపోవడంతో కుమార్తె స్వప్న ఫోన్ చేసింది. అతని ఫోన్ నంబర్లు పని చేయలేదు. రోడ్డుపై ఉన్నాడేమో చూసి రమ్మని వాచ్‌మెన్‌ను పంపించారు. అతను బయటికి వెళ్లగానే ఇంటి సమీపంలో వేణుగోపాల్‌రెడ్డి స్కూటీ పడిపోయి ఉంది. పక్కనే అతని చెప్పులతోపాటు కారం పొడి ఉండడంతో ఫైనాన్షియర్ కిడ్నాప్‌నకు గురయ్యాడని కుటుంబ సభ్యులు భావించారు. ఇదిలా ఉండగా రాత్రి 8 గంటల తర్వాత వేణుగోపాల్‌రెడ్డి ఇంటికి వస్తాడని భావించిన దుండగులు ప్రధాన రహదారిలోని ఆర్చీ వద్ద కాపు కాసినట్లు తెలుస్తోంది. స్కూటీలో ఇంటికి వెళ్తున్న సమయంలో ఆర్చీ దాటగానే దుండగులు అడ్డగించి, కళ్లలో కారం పొడి చల్లి ఘటనా స్థలంలోనే హత్య చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కిడ్నాప్ చేసి అతన్ని ఎత్తుకెళ్లాలని ముందుగా వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. వేణుగోపాల్‌రెడ్డి ఘటనా స్థలంలోనే మృత్యువాతపడడంతో మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లి కుందూలో పడేసినట్లు సమాచారం.

కుటుంబసభ్యుల అనుమానమే నిజమైంది..

బాకీ తీసుకున్న వారు గడువు ముగిసినా డబ్బు చెల్లించకపోవడంతో కొందరిపై వేణుగోపాల్‌రెడ్డి కోర్టులో కేసు వేసినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. కేసు తుది విచారణకు వచ్చినట్లు వేణుగోపాల్‌రెడ్డి భార్య ప్రమీలాదేవి మీడియాతో వెల్లడించారు. కేసు తమకు అనుకూలంగా వస్తుందని భావించిన బాకీ దారులు తన భర్తను కిడ్నాప్ చేసి హాని తలపెట్టాలని చూస్తున్నారని ఆమె అనుమానం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయితే చివరకు ప్రమీలాదేవి అనుమానమే నిజమైంది. బాకీ దారుల్లో కొందరు ఆమె భర్తను హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. వీరిలో వేణుగోపాల్‌రెడ్డి బంధువు కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

కుందూలో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు

వడ్డీ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి కిడ్నాప్‌నకు గురయ్యాడని తెలిసిన వెంటనే ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజుపాలెం ఎస్ఐ వెంకటరమణ, రూరల్ ఎస్ఐ రాజుతో కలిసి నాలుగు టీంలుగా ఏర్పడి రాత్రింబవళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. కారులో ఫైనాన్షియర్‌ను తీసుకెళ్లినట్లు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించారు. ఇలా కారు వెళ్లిన ప్రాంతాల్లో విస్తృతంగా గాలించారు. ఈ క్రమంలో చాపాడు సమీపంలోని కుందు బ్రిడ్జి వద్ద నదిలో ఆదివారం వేణుగోపాల్‌రెడ్డి మృతదేహాన్ని గుర్తించారు. ప్రొద్దుటూరు అగ్నిమాపక రెస్క్యూ టీంతో కలిసి అరుణ్‌రెడ్డి నదిలోని మృతదేహాన్ని వెలికి తీశారు. కుందూ నదిలో నీరు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో మృతదేహాన్ని వెలికి తీయడం అతి కష్టంగా మారింది. ఎట్టకేలకు శ్రమించి మృతదేహాన్ని బయటికి తీశారు. అతని మృతదేహాన్ని చూసి భార్య ప్రమీలాదేవి, కుమార్తె స్వప్న బోరునా విలపించసాగారు. కేసులో అనుమానం ఉన్న కొందరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హత్యకు గల కారణాలను తమదైన పద్ధతిలో వారి నుంచి రాబట్టే పనిలో పోలీసు అధికారులు నిమగ్నమైనట్లు తెలుస్తోంది.



రోధిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి భార్య ప్రమీలాదేవి



విషణ్ణవదనంలో గేణుపాల్‌రెడ్డి కుమార్తె స్వప్న

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయతీకి చెందిన పదో తరగతి విద్యార్థిని తల్లి మందలించిందని ఇంటి వద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో బాధితురాలిని తిరుపతికి రెఫర్ చేశారు. అదే విధంగా మండలంలోని బసిని కొండకు చెందిన శ్రీనివాసులు కుమారుడు గణేష్(20) కుటుంబ సమస్యలతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు విచారణ చేస్తున్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

కడప కోటిరెడ్డి సర్కిల్ : బాలికను ప్రేమ పేరుతో తీసుకెళ్లిన యువకుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ రెడ్డప్ప తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నూరు మండలానికి చెందిన దావూద్ ఓ బాలికను ప్రేమ పేరుతో ఈ నెల 29న తీసుకు వెళ్లినట్లు తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దావూద్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

పచ్చ మీడియా రాతలకు ప్రజలే బుద్ధి చెబుతారు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : చంద్రబాబు డైరెక్షన్‌లో వక్ర భాష్యాలతో రాతలు రాస్తున్న పచ్చ పత్రికలకు ప్రజలే బుద్ధి చెబుతారని రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా విలువలు కాలరాస్తూ రాసేవారిపై భవిష్యత్తులో కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్న ఏ ఒక్కరోజూ వైఎస్.భారతి జోక్యం చేసుకోలేదని గుర్తుచేశారు. తనకు నచ్చిన సేవా కార్యక్రమాలు, పేదలకు సాయం చేయడం తప్ప.. అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఆర్భాటం చేయలేదన్నారు. పేదల హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాల కోరు అని నిరూపించారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు, నిరుద్యోగులు, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ప్రచురించడానికి వారికి సమయం లేదా అని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు అధికంగా పెంచడం, నిత్యావసర ధరలు అధికమవడం, పాఠశాలలు, పోర్టులు, మెడికల్ కాలేజీలు ప్రవేటుపరం చేసి దండుకోవాలని చూడడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న దండు వెంకటేశ్వర్లురెడ్డి

రాయచోటి టౌన్ : ఉద్యోగులకు డీఏ, పీఆర్సీ, ఎస్ఎల్ బకాయిలు వెంటనే చెల్లించాలని జిల్లా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు దండు వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. రాయచోటి ఎన్జీవో హోంలో శనివారం జరిగిన నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన ఉద్యోగుల హక్కుల రక్షణకు సంబంధించిన విషయాలపై చర్చించారు. అనంతరం నూతనంగా ఎంపికైన ఏపీ ఎన్జీవో ప్రధాన కార్యదర్శి డివి.రమణ, జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్యలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షుడు పల్లపుమహాదేవ, బడిశెట్టి దేవేంద్ర, బి.రవిశంకర్ పాల్గొన్నారు.

రాజంపేటలో రూ.5 కే టీ షర్ట్!

దుకాణం ఎదుట జనం తొక్కిసలాట



దుకాణం వద్ద కిక్కిరిసిన జనం

రాజంపేట : రాజంపేట పట్టణంలో రూ.5 లకే టీషర్ట్ ఇస్తామని ఆర్ఎస్ రోడ్డులోని ఓ రెడిమేడ్ షాపు నిర్వాహకుడు ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో ఆదివారం ఉదయం పాత బస్టాండు నుంచి ఆర్ఎస్ రోడ్డులో ఉన్న దుకాణానికి జనం తండోపతండాలుగా వచ్చారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకూ ఉంటుందని సోషల్‌మీడియా వేదికగా ప్రచారం సాగడంతో చిన్నా, పెద్దా తేడా లేకుండా జనం తరలివచ్చారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. పోలీసుల అనుమతి కూడాలేకుండా బిజినెస్ పోస్టింగ్‌లు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడంపై పలువురు పెదవి విరిస్తున్నారు. ఆఫర్లతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేందుకు కారణమైన షాపు నిర్వాహకుడిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వ్యక్తి అదృశ్యం

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రకాశ్ నగర్‌లో నివాసముంటున్న నాగన్న కుమారుడు వలస గాళ్ల నాగరాజు(40) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ప్రకాశనగర్ కాలనీకి చెందిన నాగరాజు ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు, ఇతడికి భార్య పెద్దక్క, కుమారుడు ఉన్నారు. నాగరాజుకు అప్పులు అధికంగా ఉండడంతో వాటిని తీర్చలేదని భావించి ఈ నెల 18న బయటకు పోయాడు. ఇప్పటివరకూ రాకపోవడంతో అతని భార్య పెద్దక్క పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు యర్రగుంట్ల పోలీసులు తెలిపారు.

ఇంటి సామగ్రి దగ్ధం



అగ్నిప్రమాదం జరిగిన ఇల్లు

చింతకొమ్మదిన్నె : మండలంలోని టి.క్రిష్టాపురం గ్రామంలో ఉంటున్న నాగూరు భార్గవరెడ్డి ఇంట్లో ఆదివారం సాయంత్రం విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అధికారులు ఫైర్ ఇంజిన్‌తో వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని ఎలక్ట్రికల్ పరికరాలు, వాషింగ్ మెషిన్, ఫ్రిడ్జ్, టీవీ, బీరువాలు, అందులోని సర్టిఫికెట్లు, బట్టలు, డబ్బులు కాలిపోయాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో దాదాపు మూడు లక్షల రూపాయల విలువ మేర నష్టం జరిగినట్లు బాధితుడు భార్గవరెడ్డి తెలియజేశారు.

పల్లెల్లో జోరుగా పేకాట

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కొండాపురం మండలంలోని కొన్ని గ్రామాల్లో కూటమి నాయకుల కనుసన్నుల్లో పేకాట జోరుగా సాగుతోంది. యర్రగుడి పునరావాస కేంద్రం సమీపంలోని సపోట తోట, దొబ్బుడు పల్లె పమీపంలోని కంపచెట్ల వద్ద, కె.సుగుమంచిపల్లె పునరావాస కాలనీలోని చెట్ల వద్ద, కొండాపురం ఈసర్ పెట్రోల్ బంకు సమీపంలోని ఓ చీనీ తోటలో చాలామంది పేకాట ఆడుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ అధికార పార్టీ ఒత్తిళ్లతో ఏమీ చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు తెలిసినా వాటిని ఉన్నతాధికారులకు చేరవేయడంలో విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కేబుల్ వైర్లు చోరీ

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామం శోచరీపురం పొలం పరిధిలో 20మంది రైతుల తోటల్లో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి శనివారం కేబుల్ వైర్లు అపహరించారు. రైతులు మాట్లాడుతూ పంట పండక, గిట్టుబాటు ధరలేక ఇబ్బంది పడుతున్న తరుణంలో తోటల వద్ద బోర్ల కేబుల్‌ను అపహరించడంతో నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–కృష్ణాపురం రైల్వే స్టేషన్ మధ్య గూడ్స్‌రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. ఈ మార్గంలో దిగువ రైలు పట్టాల వద్ద మృతిచెందిన వ్యక్తి 40–45 ఏళ్ల వయస్సు కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీఆర్ఏల జిల్లా కమిటీ ఎన్నిక



వీఆర్ఏల సంఘం జిల్లా కమిటీ

రాజంపేట రూరల్ : ఏపీ విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ గ్రామ సేవకుల సంఘం జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందంగీసాహెబ్ నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా సీహెచ్.చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడిగా మోడీప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కొరముట్ల సుధాకర్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా ఎ.తిరుపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.నరసింహులు, ఉపాధ్యక్షుడిగా ఇ.మధుబాబు, కే.మణి, ఎం.రామచంద్రయ్య, షేక్ ఖాదరవలి, కె.రమణయ్య, బి.రత్నమ్మ, ఎన్.లావణ్య, సహాయ కార్యదర్శులుగా ఎన్.నరసింహులు, ఎం.కోటేశ్వరరావు, బి.హరీష్, ఎస్.నరసయ్య, కోశాధికారిగా లకీష్ మకర్, కమిటీ సభ్యులుగా ఎం.పీరయ్య, ఎ.శ్రీను, బి.సుబ్రహ్మణ్యం, పి.కులశేఖర్, ఇ.బలరామ్, సురేంద్ర, పి.గిరిజ, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

- మహిళను కాపాడిన పోలీసులు
- సిబ్బందిని అభినందించిన ఎస్పీ



రైల్వే ట్రాక్ వద్ద బాధిత మహిళతో మాట్లాడుతున్న పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలనుకున్న మహిళను బ్లూ కోల్ట్ పోలీసులు రక్షించారు. జిల్లా ఎస్పీచే అభినందనలు అందుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. కుటుంబ కలహాలతో కడప ఎర్రముక్కపల్లి సమీపంలో ఉంటున్న ఓ మహిళ, ఇద్దరు పిల్లలను తీసుకుని ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో భాకరాపేట రైల్వే గేట్ వద్ద ట్రాక్‌పై నడచి వెళ్తోంది. విధుల్లో ఉన్న ట్రాక్‌మెన్ కిశోర్ గుర్తించి 112కు సమాచారం చేరవేశారు. గస్తీలో ఉన్న బ్లూకోల్ట్ సిబ్బంది, కానిస్టేబుళ్లు రమాకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు రంగంలోకి దిగి రైలు కింద పడి తనువు చాలించాలనుకున్న మహిళ, ఇద్దరు పిల్లలను సురక్షితంగా తీసుకువచ్చారు. కుటుంబసభ్యులకు అప్పగించి స్థానికుల మన్ననలు పొందారు. నిమిషం ఆలస్యమైనా స్టేషన్ నుంచి బయలుదేరిన రైలు క్రిందపడి ముగ్గురు విగత జీవులుగా మిగిలేవారు. మహిళకు కౌన్సిలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు. సురక్షితంగా కాపాడిన సిబ్బందిని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బలవన్మరణానికి పాల్పడడం అత్యంత భయంకరమైన నిర్ణయమని, ఉద్వేగంతో క్షణాల్లో ఇక జీవించలేనంటూ స్వస్తి పలకడం పొరపాటు నిర్ణయమని వివరించారు. సమస్యలతో సతమతమవుతున్న వారు ఎందరో కాలంతో పోరాడి ఎలా బ్రతుకుతున్నారో చూసి, ఆత్మస్థైర్యంతో జీవించాలని ఎస్పీ సూచించారు.

పనుల్లో నాణ్యత డొల్ల



నదిపై నిర్మించిన పిల్లర్

జమ్మలమడుగు : జాతీయ రహదారి నిర్మాణంలో డొల్లతనం బయటపడుతోంది. నంద్యాల–జమ్మలమడుగు 167 నెంబర్ జాతీయ రహదారి పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. అప్పడప్పుడూ చుట్టపు చూపుగా వచ్చే అధికారులు నామామాత్రంగా తనిఖీలు చేసి పోతున్నారనే విమర్శలున్నాయి. కీలకంగా ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్ ఇంజినీర్లు పనులు చేస్తున్నారేగానీ నేషనల్ హైవే అధికారుల పర్యవేక్షణ లేదని తెలుస్తోంది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పెన్నానదిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడే నాణ్యతలో డొల్లతనం బయటపడుతోంది. కనీసం 16 ఎంఎం కడ్డీలను ఉపయోగించితేనే పిల్లర్లు పటిష్టంగా ఉంటాయి. కానీ కంపెనీ 10 ఎంఎం, 8 ఎంఎం, 6 ఎంఎం కడ్డీలు రెండు, మూడు కడ్డీలు 16ఎంఎం ఉపయోగించడం జరుగుతోంది. దీంతో ఈ పిల్లర్లు ఎంత వరకు నిలబడుతాయోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

డిజైన్ ప్రకారమే పిల్లర్ల నిర్మాణం

పెన్నానదిపై హై లెవల్ వంతెన నిర్మాణం జరుగుతోంది. డిజైన్ ప్రకారమే జరుగుతున్నాయి. ఒక్కొక్క పిల్లర్ ఒక్కో రకంగా ఉంటాయి.

– సురేందర్‌రెడ్డి, ఏఈ, జమ్మలమడుగు

రోడ్డు ప్రమాదంలో నాయబ్ రసూల్ మృతి



రసూల్ మృతదేహం

పోరుమామిళ్ల : స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద శనివారం రాత్రి మోటార్ బైక్‌ను ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో షేక్ నాయబ్‌రసూల్(45) గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందారు. మహబూబ్‌నగర్‌కుకు చెందిన రసూల్ కుమార్తె కోసం వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. రసూల్ తీవ్రంగా గాయపడి కింద పడ్డారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. రసూల్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నట్లు తెలిపారు. రసూల్ భార్య రెహానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా



బోల్తా పడిన కడప డిపో బస్సు

మైదుకూరు : విజయవాడ నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వరదాయపల్లె సమీపంలో శనివారం బోల్తా పడింది. బస్సు డ్రైవర్‌తో సహా పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. విజయవాడ నుంచి వస్తున్న బస్సులో జీవీసత్రం ప్రాంతానికి చెందిన కొందరు విద్యార్థులు బయలుదేరారు. ఉదయం 5 గంటల ప్రాంతంలో నెల్లూరు–బళ్లారి జాతీయ రహదారిపై వరదాయపల్లెకు సమీపంలో ఆపాలని కండక్టర్‌ను విద్యార్థులు కోరారు. ఆ మేరకు డ్రైవర్ కొన్ని మీటర్ల మేరకు బైపాస్‌పై ఉన్న బస్సును రివర్స్ చేసేందుకు యత్నించాడు. దాంతో బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌తో పాటు బస్సులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. కడప డిపో అధికారుల సమాచారంతో గ్యారేజీ కార్మికులు సంఘటనా స్థలానికి చేరుకొని బస్సును యథాస్థితికి తెచ్చారు.

ఆటో బోల్తా



బోల్తా పడిన ఆటోను తీస్తున్న స్థానికులు

కమలాపురం : కమలాపురం పట్టణం క్రాస్ రోడ్డు ఆర్చి వద్ద గుంతల్లో పడి ఆటో బోల్తా పడింది. కడప నుంచి కమలాపురం పట్టణంలోనికి ఆటో వస్తోంది. ఆర్చి వద్ద పెద్ద గుంత ఉంది. అందులో వర్షపునీరు నిలవడంతో గుర్తించలేక అదుపు తప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు. అదే స్థలంలో ఇది వరకూ ఓ వాహనంతోపాటు, మోటార్ బైక్ బోల్తా పడ్డాయని స్థానికులు తెలిపారు.

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలోని ఉమ్మారెడ్డిపల్లె సమీపంలో లారీ–మినీ ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. పిడుగురాళ్ల నుంచి అనంతపురానికి పెయింట్స్ లోడ్‌తో ఓ లారీ ప్రయాణిస్తోంది. ఎదురెదురుగా ఉమ్మారెడ్డిపల్లి సమీపంలో రెండూ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలోనే ఇరుక్కుపోయి డ్రైవర్ రాజేష్‌ను స్థానికులు బయటకు తీసారు.

ఆసుపత్రిలో పాము కలకలం



కిటికీలో నుంచి వస్తున్న పాము

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో పాము ఆదివారం కలకలం రేపింది. ఆసుపత్రి వెనుక భాగంలో ఖాళీ ప్రదేశం ఉండడం, ఇటీవల వర్షాలు పడడంతో గర్భిణులు ఉండే వార్డులోకి పాము ప్రవేశించింది. గమనించిన రోగులు ఆసుపత్రి సిబ్బందికి తెలిపారు. సెక్యూరిటీ వచ్చి కర్రతో కొట్టి చంపివేయడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు.